



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 654 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర సోమవారం 02 ఫిబ్రవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం

# వికసిత సంకల్పం యువశక్తి ప్రేరేపితం

**-ఆర్థిక వృద్ధి, భవిష్యత్ లక్ష్యాలను ఆవిష్కరించిన కేంద్ర బడ్జెట్ -ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఊతం ఇచ్చే బడ్జెట్**

**-ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు**

**-వరుసగా 9వ బడ్జెట్ ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించిన నిర్మలా సీతారామన్ కి అభినందనలు**

మంగళగిరి, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, ఫిబ్రవరి 01 : దేశంలో యువశక్తిని మేల్కొల్పాలి. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి. మౌలిక ప్రగతికి బాటలు వేయడం ద్వారా 2047 నాటికి దేశాన్ని ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలపాలన్న బలమైన సంకల్పండ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో ప్రస్ఫుటమవుతోంది. వికసిత భారత్ లక్ష్యాలు సాధించేందుకు ఎలాంటి సంస్కరణలను అమలు చేయాలి... ఆ లక్ష్యం వైపు ప్రజలను ఎలా అడుగుల వేయించాలి... యువశక్తిని ప్రేరేపిస్తూ దేశాన్ని ఎలా ముందుకు నడిపించాలనే దృక్పథం 2026-2027 కేంద్రం బడ్జెట్ లో కనబడింది. వరుసగా 9వసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా చరిత్ర కెక్కిన నిర్మలా సీతారామన్ కి అభినందనలు. సంస్కరణలే దేశ ఆర్థిక ప్రగతికి మూలాలు అన్న సూత్రాన్ని ముందుకు తీసుకువెళ్తూ ఆమె ప్రవేశ పెట్టిన ప్రతి బడ్జెట్ దేశాన్ని స్థిరమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతూ వచ్చాయి. ప్రపంచం మొత్తం మాంద్యం వైపు అడుగులు వేస్తున్న సమయంలోనూ భారత దేశం తన సత్తా ఏంటో నిరూపించుకుంది. సంస్కరణలు, సంక్షోభ నివారణ, మౌలిక ప్రగతి, దేశ భద్రత, రైతు సంక్షేమం, వికసిత గ్రామీణ భారతం, ఆర్థిక స్వావలంబన తదితర అంశాలకు పెద్ద పీట వేసిన 2026-2027 బడ్జెట్ ను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం.



2

# టిటిడి ఇవోగా ముద్దాడ రవిచంద్ర

అమరావతి, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, ఫిబ్రవరి 01 : కల్తీ లడ్డు వివాదంలో కూరుకున్న తిరుమల తిరుపతి దేవస్థానముల ఇవో అనీల్ కుమార్ సింఘాల్ పై బదిలీ వేటు పడింది. జగన్ ప్రభుత్వంలోనూ అప్పట్లో ఆయనే టిటిడి ఇవోగా ఉన్నారు. ఇప్పుడు సుప్రీం కోర్టు నియమించిన సిట్ నివేదికలో అసలు ఆవులు లేవు, నెయ్యి లేదు, అంతా కాక్టెయిల్ కెమికల్స్ అని తేల్చడంతో ప్రభుత్వం చేతిలో వున్న అధికారాన్ని ఉపయోగించి ఆకస్మికంగా అనీల్ సింఘాల్ పై వేటు వేశారు. టిటిడి నూతన ఇవోగా సమర్థుడైన డైనమిక్ ఐఏఎస్ అధికారి రవిచంద్ర ముద్దాడను పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. ఆయన ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. ఆ విధులు నిర్వహిస్తూనే టిటిడి బాధ్యతలు కూడా చేపట్టనున్నారు.

**- రవిచంద్ర ముద్దాడ 1996 బ్యాచ్ కు చెందిన ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ క్యాడర్ అధికారి**

ఉమ్మడి రాష్ట్రంలో 2003లో రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ గా అప్పట్లో సంచలనం సృష్టించారు. వివాదస్పదంగా మారి కబ్జాకు గురైన వందల కోట్ల భూమిని కాపాడి ప్రభుత్వానికి అప్పగించి గుర్తింపు పొందారు. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో మేటి



అధికారిగా పేరు పొందారు. నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ గా మంచి పేరు తెచ్చుకున్నారు.

**- కోవిడ్ సమయంలో ఆరోగ్య శాఖ కార్యదర్శిగా**

ఆయన చేసిన సేవలు అసామాన్యం. ఎంతో సింపుల్ గా డౌన్ టు ఎర్త్ వుండే అధికారి. తనకు అప్పగించిన విధులను చిత్తశుద్ధితో నిర్వహించే సమర్థమైన అధికారి. ఏ రాజకీయ పార్టీ ప్రభుత్వ అధికారంలో వున్నా, వ్యక్తిగత పేరు కన్నా ప్రభుత్వానికి పేరు రావాలని నిజాయితీగా కష్టపడి పని చేసే అత్యుత్తమ అధికారి రవిచంద్ర ముద్దాడ.

# రాష్ట్రంలో అరాచక, ఆటవిక పాలన సాగుతోంది

**ఈ నిప్పు చంద్రబాబు ప్రభుత్వాన్నే దహించివేస్తుందని హెచ్చరిక**



ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వైసీపీ నేతలు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై జరిగిన దాడుల వెనుక చంద్రబాబు హస్తం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో అరాచక, ఆటవిక పాలన సాగుతోందని, ఇది 'జంగిల్ రాజ్' కు నిదర్శనమని ధ్వజమెత్తారు.

గతంలో వైసీపీ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు తప్పని కేంద్ర ప్రభుత్వ ల్యాబ్ లు ఎన్‌డీడీబీ , ఎన్‌డీఆర్ఐ నివేదికలు నిర్ధారించాయని గుర్తుచేశారు. ఈ నిజాన్ని ప్రశ్నించినందుకే జీర్ణించుకోలేక అంబటి, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు చేయించి నిప్పు పెట్టించారని ఆరోపించారు. "ఈ దుశ్చర్యలతో భయాన్ని కలిగించానని మీరు అనుకోవడం మీ భ్రమే. ఆ నిప్పు మీ ప్రభుత్వానికి మీరే పెట్టుకున్నారని గుర్తుంచుకోవాలి" అని చంద్రబాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ దాడులు ప్రజాస్వామ్యంపై రగిల్చిన మంటల వేడి, చంద్రబాబు సర్కారును దహించివేయక మానదని జగన్ హెచ్చరించారు. రానున్న కాలంలో ప్రజాగ్రహ జ్వాలలు ఉవ్వెత్తున ఎగిసి, ప్రభుత్వాన్ని బూడిద చేస్తాయని అన్నారు. "చరిత్ర చెప్పే సత్యం ఒక్కటే. హింసా జ్వాలలను రగిల్చే చేయి కాలక తప్పదు, అరాచక పాలన అంతం కాక తప్పదు. మీరు సృష్టించిన 'జంగిల్ రాజ్' భూస్థాపితం కావడం ఖాయం" అని జగన్ పేర్కొన్నారు.

# నేరపూరిత రాజకీయాలే వైసీపీ సంస్కృతి

**- సీఎం చంద్రబాబు**

**వైసీపీ హయాంలో రాజకీయాలు నేరమయం అయ్యాయన్న చంద్రబాబు**

**తాము అధికారంలోకి వచ్చాక చట్టబద్ధ పాలన నెలకొల్పామని వెల్లడి**

**నిరాశ, నిస్పృహలతోనే వైసీపీ నేతలు తిట్లకు దిగుతున్నారని విమర్శ**

**శాంతిభద్రతలను ఉల్లంఘిస్తే ఎవరినీ వదిలిపెట్టేది లేదని స్పష్టీకరణ**



వైసీనీ రాజకీయాలు నేరమయం అయ్యాయని, వారి పాలనకు అరాచకమే నమూనాగా నిలిచిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. 2024లో తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలనను తిరిగి నెలకొల్పామని ఆయన స్పష్టం చేశారు. నేరపూరిత రాజకీయాలే వైసీపీ సంస్కృతి అని... ప్రజా సాధికారత, ప్రజాసేవ తమ ప్రభుత్వ సంస్కృతి అని ఆయన పేర్కొన్నారు.

గతంలో వారు ధ్వంసం చేసిన ప్రతీదాన్నీ తమ ప్రభుత్వం తిరిగి నిర్మిస్తుండటాన్ని చూసి వైసీపీ నేతలు ఓర్వలేకపోతున్నారని చంద్రబాబు అన్నారు. వారి తప్పులు రోజురోజుకు బయటపడుతుండటంతో, నిరాశ, నిస్పృహలకు లోనై ప్రతిపక్షంలో ఉన్నా కూడా దూషణలకు దిగుతున్నారని ఆరోపించారు. అయితే, చట్టం అత్యున్నతమైనదని, తాము నెలకొల్పిన శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని చంద్రబాబు తేల్చిచెప్పారు. చట్టాన్ని, నియమాలను ఉల్లంఘించడానికి ఎవరినీ అనుమతించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు.




# వికసిత్ భారత్ దిశగా కేంద్ర బడ్జెట్

## -2047 లక్ష్య సాధనకు పటిష్ట పునాది
## - సబ్ కా సాత్, సబ్ కా వికాస్ స్ఫూర్తితో సమగ్ర అభివృద్ధి బడ్జెట్
## - ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 01 : దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే దిశగా ఈరోజు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఒకే ప్రధాని హయాంలో తొమ్మిదవసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం అరుదైన ఘనత అని పేర్కొంటూ, నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలిపారు. అలాగే పార్లమెంట్ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘ ప్రసంగం చేసి కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ప్రజలకు భరోసా ఇచ్చారని చెప్పారు. ప్రపంచ ఆర్థిక పరిణామాలకు అనుగుణంగా దేశాభివృద్ధికి వేగం చేకూర్చేలా ఈ బడ్జెట్‌ను రూపొందించారని ఎమ్మెల్యే వివరించారు. వ్యూహాత్మక రంగాల్లో మాన్యుఫాక్చరింగ్ పెంపు, పారిశ్రామిక వారసత్వ పునరుద్ధరణ, ఎం.ఎస్.ఎం.ఈలను జాతీయ స్థాయి చాంపియన్లుగా తీర్చిదిద్దడం, మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత, దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం, సిటీ ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధి వంటి ఆరు కీలక సూత్రాలపై ఈ బడ్జెట్ ఆధారపడిందన్నారు.

- ఈరోజు బడ్జెట్‌లో తీసుకున్న కొన్ని కీలక నిర్ణయాలు : మౌలిక సదుపాయాల రంగానికి భారీ కేటాయింపులు చేసి జాతీయ రహదారులు, రైల్వే నెట్‌వర్క్, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి ప్రాధాన్యత

గృహ నిర్మాణ రంగానికి మరింత ఊతం ఇచ్చేలా పట్టణ, గ్రామీణ గృహ పథకాలకు అధిక నిధులు

రైతుల ఆదాయం పెంపునకు సాగునీటి ప్రాజెక్టులు, ప్రకృతి వ్యవసాయం, రైతు ఉత్పత్తి సంస్థలకు మద్దతు, మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణ పరిమితి పెంపు, మహిళా సాధికారతకు ప్రత్యేక కార్యక్రమాలు

యువతకు నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం, డిజిటల్ ఇండియా విస్తరణ

గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాలకు మద్దతు ఇచ్చే విధానాలు, రక్షణ రంగంలో స్వదేశీ తయారీ పెంపు, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి బలమైన చర్యలు, వ్యవసాయం, రక్షణ, విద్య, వైద్యం, గ్రామీణపట్టణాభివృద్ధి, సామాజిక సంక్షేమం వంటి రంగాలకు సముచిత కేటాయింపులు చేసి అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులకు రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు ఇవ్వడం మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఊరటనిచ్చే నిర్ణయమని అన్నారు. క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల చికిత్సకు అవసరమైన వైద్య వసతులు మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ఈ బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం లభించిందని బండారు సత్యానందరావు చెప్పారు. జిల్లాకో గర్ల్స్ హాస్టల్ ఏర్పాటు, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి ఉన్నత విద్యా కోర్సులకు ప్రోత్సాహం, అమరావతి రాజధాని అభివృద్ధికి ఏడీబీ నిధులుగా రూ.1,128.91 కోట్లు, అమరావతి సమగ్ర పట్టణాభివృద్ధికి జపాన్ నిధులు, గ్రామీణ రహదారి ప్రాజెక్టులు, పట్టణ తాగునీరుమురుగు నీటి పారుదల, పోలవరం ప్రాజెక్టుకు భారీ కేటాయింపులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. ఏపీలో ఎన్డీఏ కూటమి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విశ్వాసం వ్యక్తం చేశారు.

# వికసిత సంకల్పం యువశక్తి ప్రేరేపితం

ఆపరేషన్ సిందూర్ ద్వారా మన రక్షణ బలం ఏంటో ప్రత్యర్థులకు చాటిన మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, ఈసారి బడ్జెట్ లో రక్షణ రంగానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చింది. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్ లో రూ.7.84 లక్షల కోట్లు రక్షణ రంగానికి కేటాయించడం ద్వారా దేశ రక్షణకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో చెప్పకనే చెప్పారు. బోర్డర్ సెక్యూరిటీతోపాటు దేశ అంతర్గత భద్రతకూ ప్రాధాన్యత ఇస్తూ ఈ సారి హోంశాఖకు రూ.2.55 లక్షల కోట్లు కేంద్రం కేటాయించింది. సరిహద్దు భద్రత, అంతర్గత శాంతి భద్రతలు బలంగా ఉన్నప్పుడే దేశం ఆర్థికంగానూ దూసుకుపోతుందన్న సూత్రాన్ని ఇక్కడ అమలులో చూపారు. రక్షణ రంగం తర్వాత రవాణా రంగానికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. హైస్పీడ్ కారిడార్లతో దేశంలోని ప్రాంతాల మధ్య అంతరాలు తగ్గించడం, రవాణా రంగానికి ఊతమివ్వడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. రూ.10 వేల కోట్ల ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్, పట్టణాల్లో చేపట్టిన కార్పోరేట్ మిత్రులు, ప్రజలకు ఈజ్ ఆఫ్ లివింగ్, వ్యాపారవేత్తలకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటివి దేశంతోపాటు రాష్ట్ర ప్రగతికి చోదక శక్తిలా ఉపయోగపడతాయి. ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి మద్దతునిస్తుంది. రూ.1.40 లక్షల కోట్ల వ్యవసాయ బడ్జెట్ రైతు సాధికారిత దిశగా అడుగులు వేయడానికి ఉపయోగపడుతుంది. గ్రీన్ ఎనర్జీ, విద్యా, వైద్యం, నైపుణ్యాభివృద్ధి రంగాలకు ఇస్తున్న ప్రోత్సాహకాలు ప్రతి ఒక్కరికీ ఉపయోగపడతాయి. ముఖ్యంగా 17 రకాల క్యాన్సర్ ఔషధాలపైన, డయాబెటిక్ లాంటి దీర్ఘకాల వ్యాధులకు వినియోగించే మందులపైనా పన్ను తగ్గింపు కోట్లాది మందికి ఊరటనిచ్చే అంశం. డేటా సెంటర్ల ఏర్పాటు చేసే సంస్థలకు 2047 వరకు ప్రకటించిన టాక్స్ హాలిడే దేశాన్ని డేటా సెంటర్ల కేంద్రంగా మారుస్తుంది. ఇప్పటికే గూగుల్ లాంటి సంస్థలు విశాఖ కేంద్రంగా డేటా సెంటర్లు పెట్టేందుకు ముందుకు రాగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మరిన్ని సంస్థల ఏర్పాటుకు దారిచూపనుంది. పర్యాటక రంగంలో ఇస్తున్న ప్రోత్సాహకాలు అరకు లాంటి పర్యాటక ప్రాంతాలకు ఊతం ఇవ్వనున్నాయి. బడ్జెట్ లో ప్రకటించిన ఏడు హైస్పీడ్ కారిడార్లలో రెండు రాష్ట్రం మీదుగా వెళ్లనున్నాయి. ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ రాష్ట్ర తీర ప్రాంత పారిశ్రామిక ప్రగతికి మరింత ఊతం ఇస్తుంది. కేంద్రం ఎంపిక చేసిన రేర్ ఎర్త్ కారిడార్లలో ఆంధ్రప్రదేశ్ కూడా ఉండడం విలువైన ఖనిజాల వెలికితీత, తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తుంది. తీర ప్రాంత మత్స్యకార సర్యూట్ బలోపేతం చేయడం, మహిళలు చేపలు పెంచుకునే అవకాశం, ఎలాంటి సుంకం లేని చేపల పెంపకం వంటి నిర్ణయాలు మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతాయి. ముఖ్యంగా ఉపాధి 100 రోజుల ప్రణాళికకు ఈ బడ్జెట్ ఊతం ఇస్తుంది. చేనేత రంగానికి ఇస్తున్న ప్రోత్సాహకాలు రాష్ట్ర చేనేత పరిశ్రమను మరోస్థాయికి తీసుకువెళ్లేందుకు ఉపయోగపడుతుంది. కొబ్బరి, జీడిపప్పు, కోకో రైతుల కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేక పథకాలు కోనసీమ ప్రాంతంలోని కొబ్బరి రైతులకు, ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని జీడి రైతులకు ఊరటనిస్తుంది. ఈ బడ్జెట్ భారత భవిష్యత్ శక్తి ఆవిష్కృత బడ్జెట్. బడ్జెట్ ఫలాలు రాష్ట్ర ప్రగతికి దోహదం చేసేలా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నిరంతరం కృషి చేస్తాము. దేశ ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు



# అంబటి వ్యాఖ్యలపై గంపలగూడెం కూటమి శ్రేణుల నిరసన

గంపలగూడెం

తోటముల రింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో గంపలగూడెం మండలం మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రేగళ్ల వీరారెడ్డి మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసాన్ని తట్టుకోలేక అంబటి రాంబాబు వ్యక్తిగత స్థాయికి దిగజారి మాట్లాడటం అసలు రాజకీయ సంస్కృతి కాదు ప్రజలకు పనికొచ్చే మాట చెప్పలేకపోతే కనీసం పెద్దలపై అవమానకరమైన వ్యాఖ్యలు చేయకుండా ఉండటం నేర్చుకోవాలి ముందు ప్రభుత్వం ఐదేళ్లలో ఏం చేసింది అన్నదానికి సమాధానం చెప్పలేక అభివృద్ధి ఎలా చేయాలి అన్నదానికి దారులు తెలియక, నారా చంద్రబాబు గారి పేరు వినగానే భయపడే స్థితికి వచ్చారు. అందుకే ఇలాంటి స్థాయి లేకుండా మాట్లాడుతున్నారు అంతేకాక కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కూటమి నాయకులు కూడా అంబటి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రాజకీయాల్లో విమర్శలు ఉండొచ్చు కానీ వయస్సుకు, పదవికి గౌరవం ఇవ్వడం సంస్కారం ఆ సంస్కారం లేని నాయకత్వం రాష్ట్రానికి చేశింది నష్టం తప్ప ఏ ప్రయోజనమూ కాదు అన్నారు.

# కాంపౌండ్ వాల్ కూలిపోయిందని విద్యార్థుల పిర్యాదు

## - పట్టించుకోని అధికారులు - ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సోడి అశోక్



వెంకటాపురం, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 01 : మండల కేంద్రంలో ఉన్న బీసీ హాస్టల్ కాంపౌండ్ వాల్ వర్షాకాల సమయంలో కూలిపోయింది అని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పిర్యాదు చేసినా ఇప్పటివరకు పట్టించుకోవడంలేదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా సహాయ కార్యదర్శి సోడి అశోక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీసీ హాస్టల్లో కాంపౌండ్ వాల్ పడి, అధికారుల దృష్టిలో ఉన్న కానీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నారు తప్ప విద్యార్థుల ఇబ్బందులు కూడా చూడటం లేదన్నారు. హాస్టల్ భవనం శిధిలావస్థకు చేరి, బిల్డింగ్ పై పెచ్చులు విద్యార్థుల మీద పడుతున్నాయనీ విద్యార్థులు అధికారులకు తెలియజేసినా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జిల్లాకు పంచాయతీ శాఖ మంత్రి సీతక్క ఉన్నాగాని ఇప్పటివరకు విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కూడా ఏర్పడిన పరిస్థితి లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టల్లో విచారణ జరిపి, విద్యార్థులకు ఏమేమి అవసరం పడతాయో చూసి, తక్షణమే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు








# మాజీ మంత్రి అంబటి రాంబాబుపై దాడిని తీవ్రంగా ఖండించిన జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి

**- తిరుమల శ్రీ వారి లడ్డుపై అసత్య ప్రచారం బట్టబయలు కావడంతో**

**డైవర్షన్ పాలిటిక్స్‌కు కూటమి ప్రభుత్వం దిగజారింది**

కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 01 : మాజీ మంత్రి అంబటి రాంబాబుపై జరిగిన దాడిని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ ప్రత్యర్థులపై భౌతిక దాడులు చేయడం అత్యంత హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదంపై కూటమి ప్రభుత్వం చేసిన అసత్య ప్రచారం పూర్తిగా బట్టబయలయ్యిందన్నారు. స్వామివారి లడ్డులో ఎటువంటి జంతు కొవ్వు పదార్థాలు కలవలేదని సిబిఐ స్పష్టంగా వెల్లడించడంతో, ప్రభుత్వ వైఫల్యాలు మరియు అబద్ధాలు ప్రజల ముందు బయటపడ్డాయన్నారు. ఈ నిజాన్ని ప్రజల దృష్టి నుంచి మళ్లించేందుకే డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా మాజీ మంత్రి అంబటి రాంబాబుపై దాడి చేయించారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఇలాంటి చర్యలతో ప్రజల మనోభావాలను దెబ్బతీయాలని, ప్రతిపక్షాన్ని భయపెట్టాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. దాడికి బాధ్యులైన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన చిర్ల జగ్గిరెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎప్పటికీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఫిబ్రవరి 6,7,8 బషీర్ బీబీ ఔలియా ఉరుస్సు ఉత్సవాలు

యు.కొత్తపల్లి, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 01 : కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం పొన్నాడ పంచాయతీ పొన్నాడ గ్రామంలో వెలసిన బషీర్ బీబీ (బంగారు పాపమ్మ) ఔలియా ఉరుస్సు ఉత్సవాలు మాఘమాసం మాఘ పౌర్ణమికి అనగా ఫిబ్రవరి 6,7,8వ తేదీలలో శుక్ర, శని, ఆదివారం వరకు ఉత్సవాలు జరుగుతాయి. చివరి రోజు స్థానిక ముజావర్లు గంధోత్సవం నిర్వహిస్తారు. హిందూ,ముస్లిం, క్రిస్టియన్ ఐక్యతగా నిలిచే బషీర్ బీబీ ఔలియా 71వ ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరుగునని స్థానిక ముజూవర్లు షేక్ బషీర్, షేక్ ఇమామ్ వలి, షేక్ నాగూర్ తనీషా, షేక్ మహమ్మద్ ఇమ్మాలియా, షేక్ బడే సాహెబ్ తెలియజేశారు. ప్రతి సంవత్సరం జరిగే బషీర్ బేబీఔలియా ఉరుసు ఉత్సవాలు ప్రతి సంవత్సరం శుక్రవారం, శనివారం, ఆదివారం ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సంవత్సరం అమ్మవారి పాత ఆలయం పై కొత్తగా నిర్మించడం జరిగిందని అన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారికి పచ్చని జాకెట్ ముక్క, కరకాజ్యం, గులాబీ పువ్వులు బషీర్ బీబీకి నైవేద్యంగా సమర్పిస్తారు. దర్గా ప్రాంగణంలో ఉన్న చెట్టు కొమ్మకు ఉయ్యాలను కడతారు. అలా కట్టడం వలన వారికి సంతతి కలుగుతుందని ప్రగాఢ విశ్వాసం ఉంది. దేశం నలు మూలల నుండి ముస్లిం సోదరులు బషీర్ బీబీ (బంగారు పాప) దర్గాకు చేరుకుంటారు. ఈ మూడు రోజులు దర్గా ప్రాంగణంలో నిద్రించి వారి కోర్కెలను మొక్కలను తీర్చుకుంటారు. ఈ ఉత్సవాలలో భాగంగా కవాలి నిర్వహిస్తారు. ఆదివారం మూలపేటలో మౌలా సాహెబ్ ఇంటి వద్ద నుండి ఫకీర్ మేళ నిర్వహిస్తారు. బొడ్డేపల్లి వారు సమర్పించే గంధం (దందల్) గుర్రంపై తీసుకుని వస్తారు. గంధం దర్గాకు చేరుకునే వరకు పోలీసు బందోబస్తు ఉంటుంది. పోలీసు సంరక్షణలో భక్తులకు గంధం అందజేయడం జరుగుతుంది. ఈ మూడు రోజులు దర్గా చుట్టూ జిల్లా పోలీస్ యంత్రాంగం భక్తులకు ఎవరికి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు నిర్వహిస్తారు. దర్గా దగ్గర స్థానిక ముజూవర్లు బ్రషీర్ బీబీ సందర్శనార్థం వచ్చే ప్రజలకు సేవలు అందిస్తారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం శాసనసభ్యుడు, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కాకినాడ పార్లమెంటు సభ్యుడు తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్, పిఠాపురం మాజీ శాసనసభ్యులు ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ, పిఠాపురం మాజీ శాసనసభ్యుడు, జనసేన నాయకులు పెండెం దొరబాబు, వైయస్సార్సీపీ పిఠాపురం ఇన్చార్జి వంగ గీతా విశ్వనాథ్, స్థానిక సర్పంచ్ బండి రాణి దావీదు, ఎంపీపీ కారే సుధా శ్రీనివాసరావులను ఇంకా నాయకులను ఆహ్వానించడం జరిగిందని స్థానిక ముజావర్లు మీడియాకు తెలియజేశారు.





# కేంద్ర బడ్జెట్ ఆశాజనకం

**- కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్**

కాకినాడ, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 01 : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా ఉందని కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. కేంద్ర బడ్జెట్ పై ఆయన మాట్లాడుతూ బడ్జెట్లో అన్ని రంగాలను సంతృప్తి పరిచేలా కేటాయింపులు చేయడం శుభ పరిణామన్నారు. ముఖ్యంగా అపార ఖనిజ వనరులు ఉన్న ఆంధ్రప్రదేశ్ లో 'రేర్ ఎర్త్ కారిడార్' ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, ఇతర దేశాలపై ఆధారపడడం తగ్గి ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఏర్పడుతుందన్నారు. దీంతో పాటు ఐటీ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు 2047 వరకు దేశంలో ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లుకు 100 శాతం పన్ను మినహాయింపు ఇవ్వడం హర్షణీయమని, ఈ నిర్ణయంతో అనేక విదేశీ కంపెనీలు భారత్ లో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తాయిని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు ప్రాజెక్టులకు నిధులు కేటాయించడం పట్ల ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

# టీడీపీలో చేరిన 16వ వార్డు వైసీపీ కార్యకర్తలు



మండపేట, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 01 : మండపేట పట్టణంలోని 16వ వార్డుకి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆదివారం ఆ వార్డు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో నీలపాల కొండబాబు, సూరారపు వెంకన్న, కట్టుమేను చంద్రరావు, నీలపాల చిన్ని, నిడదవోలు రమణ, చెల్లూరి సత్యనారాయణ, గోపు రామకృష్ణ, మెండు సత్యనారాయణ, ఏపుగంటి సుబ్బారావు, కేశవరపు బంగార్రాజు ఉన్నారు. వీరందరికీ ఎమ్మెల్యే వేగుళ్ళ టీడీపీ కండువాను కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై మరియు మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరిలో విలీనం చేసిన సంధర్బంగా టీడీపీలో చేరినట్లు వారంతా తెలిపారు. ఈ కార్యక్రమంలో వాదా ప్రసాదరావు, గనిశెట్టి బాబి, సిద్దిరెడ్డి రామన్న, కట్టుమేను వీర్రాజు, మద్దాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# కళారంగంలో కొండూరుకు బెస్ట్ అవార్డు



గూడూరు, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 01 : తిరుపతి జిల్లా గూడూరు మండల పరిధి విందూరు జడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, రచయిత కొండూరు వెంకటేశ్వరరాజుకు ఐకానిక్ ఫిగ్యుర్ ఇన్ వరల్డ్ ఆఫ్ ఆర్ట్స్ అవార్డు లభించింది. అంతర్జాతీయ విద్యా, సాహిత్య, కళా సేవా సంస్థ గ్లోబల్ ఆర్టిస్ట్ రికగ్నిషన్ కౌన్సిల్ వారు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఇందుకు సంబంధించిన దృవపత్రాన్ని గ్లోబల్ ఆర్టిస్ట్ రికగ్నిషన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఇసాబెల్లా బోథ ఆదివారం అంతర్జాలం ద్వారా వెంకటేశ్వరరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా సహచర కవులు, ఉపాధ్యాయులు కొండూరుకు అభినందనలు తెలిపారు.

# ఆత్మహత్య చేసుకోబోయిన యువకుడిని కాపాడిన పోలీసులు

## - ఫోన్ సిగ్నల్ ఆధారంగా...




ఆలమూరు, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 01 : తల్లిదండ్రుల వివాదంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న యువకుడిని ఆలమూరు పోలీసు చాకచక్యంగా టెక్నాలజీ సహాయంతో పట్టుకుని కాపాడారు. వివరాల్లోకెళ్తే ఆత్రేయపురం పెద్దపేటకు చెందిన కాలా బత్తుల రవి కిరణ్ గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నాని నిర్ణయించుకుని ఆదివారం రాత్రి తన సోదరి చిన్నారికి ఫోన్ చేసి చెప్పాడు. అయితే వెంటనే చిన్నారి పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. దీంతో జిల్లా ఎస్పీ ఐటీ కోర్ టీంకు సమాచారం ఇచ్చి ఆ అబ్బాయి రవి కిరణ్ ఫోన్ నెంబరు ద్వారా లొకేషన్ ఎక్కడో తెలుసుకోగలిగారు. డాక్టర్ బీ.అర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ పాత బ్రిడ్జి వద్ద ఉన్నట్లు గుర్తించి వెంటనే ఆలమూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆలమూరు ఎస్సై జి.నరేష్ అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకుని రవి కిరణ్ ను చాకచక్యంగా పట్టుకుని రక్షించారు. అయితే తల్లిదండ్రులు గొడవలు పడుతుండటంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులకు తెలిపారు. ఇలా టెక్నాలజీ సహాయంతో యువకుడిని రక్షించిన అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీసు బృందాన్ని పలువురు అభినందించారు.

# బిసివై పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో జయకళ్యాణి ఆకులకు చోటు



భీమవరం, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 01 : భారత చైతన్య యువజన పార్టీ (బిసివై) అత్యంత కీలకమైన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ)లో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన నాయకురాలు జయకళ్యాణి ఆకులకు స్థానం కల్పించారు. పార్టీ రాజకీయ వ్యూహాలను నిర్దేశించే ఈ కమిటీలో, పార్టీ కార్యక్రమాలలో ఆమె చురుకైన పాత్రను, ప్రజా సమస్యలపై ఆమెకున్న అవగాహనను గుర్తించిన బిసివై పార్టీ అధినేత బొడే రామచంద్ర యాదవ్ ఈ నియామకం చేపట్టారు. ఈ నియామకం పట్ల జయకళ్యాణి ఆకుల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో తనకు అవకాశం కల్పించినందుకు పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ కు ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అధినేత తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పార్టీ రాజకీయ ఎదుగుదలకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా సమస్యలను, ముఖ్యంగా మహిళలు, ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

# బిసివై పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్‌గా ఆకుల వెంకట స్వామి



నరసాపురం, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 01 : భారత చైతన్య యువజన పార్టీ (బిసివై) పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్‌గా ఆకుల వెంకట స్వామిను నియమించారు. పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, క్షేత్రస్థాయిలో ప్రజలతో ఆయనకున్న సంబంధాలను గుర్తించిన బిసివై పార్టీ అధినేత బొడే రామచంద్ర యాదవ్ ఈ కీలక బాధ్యతను అప్పగించారు. ఈ నియామకం పట్ల ఆకుల వెంకట స్వామి హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కన్వీనర్‌గా తనకు బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధినేత రామచంద్రయాదవ్ కు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అధినేత తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పశ్చిమ గోదావరి జిల్లాలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. జిల్లాలోని ప్రజా సమస్యలపై, ముఖ్యంగా పశ్చిమ గోదావరి జిల్లా అభివృద్ధి కోసం పోరాడుతూ, పార్టీని ప్రజలకు మరింత చేరువ చేస్తానని ఆయన పేర్కొన్నారు.



# బిసివై పిఠాపురం నియోజకవర్గ కన్వీనర్‌గా శీరం శ్రీను

పిఠాపురం, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 01 : భారత చైతన్య యువజన పార్టీ (బిసివై) కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ కన్వీనర్‌గా శీరం శ్రీనును పార్టీ అధ్యక్షుడు బొడే రామచంద్ర యాదవ్ నియమించారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో ఆయనకున్న సంబంధాలు, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను గుర్తించిన బిసివై పార్టీ అధినేత బొడే రామచంద్ర యాదవ్ ఈ బాధ్యతను అప్పగించారు. ఈ నియామకం పట్ల శీరం శ్రీను హర్షం వ్యక్తం చేశారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత రామచంద్రయాదవ్ కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని ఆయన తెలిపారు.





Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com





# ఘనంగా డా ఉమర్ ఆలీషా
# జన్మదిన వేడుకలు











## - కొంపల్లిలో జ్ఞాన చైతన్య సభ









హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 01 : శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారి 60వ జన్మదిన వేడుకలు హైదరాబాద్ పీఠం సభ్యులు కొంపల్లిలోని కండ్లకొయ్య గ్రామంలోని హనుమాన్ ఆలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారికి పీఠం సభ్యులు ఘన స్వాగతం పలికారు. తొలుత స్వామి వారికి కోలాటంతో స్వాగతం పలికి, ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతించి, పూలతో ఏర్పాటు చేసిన మార్గంలో స్వామిని సభ వద్దకు ఆహ్వానించారు. అనంతరం హనుమాన్ ఆలయ అర్చకులు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈశ్వర లింగానికి పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారితో ప్రత్యేక అభిషేకం చేయించి, పూజలు నిర్వహించి వేద ఆశీర్వాదాలు అందించారు. వేదికనలంకరించిన ఉమర్ ఆలీషా స్వామి పూర్వ పీఠాధిపతుల చిత్రపటాలకు పూల మాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. తదుపరి ఏర్పాటు చేసిన జన్మదిన కేకును స్వామి కట్ చేసి సభ్యులకు పంపిణీ చేశారు. కొంపల్లి పీఠం సభ్యులు పీఠంతో ఉన్న తమ తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ జ్ఞాన చైతన్య



సభకు సూర్యలత వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సప్తమ పీఠాధిపతి రచించిన గీతం పీఠం సభ్యురాలు సన్నిబోయిన వరలక్ష్మి ఆలపించి సభికులను అలరింపజేసింది. పీఠం సభ్యుడు ఎస్.చిన్నబ్బాయి మాట్లాడుతూ గురుశిష్యుల అనుబంధం గురించి సభకు తెలియజేశారు. పీఠం సభ్యుడు గుర్రాల వెంకటేష్ మాట్లాడుతూ స్వామి వారికి సేవ చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని, ప్రతి గురువారం ఆరాధన చేస్తూ ఉంటామని తెలిపారు. తాత్విక బాలవికాస్ చిన్నారి ప్రణీత్ గురుశిష్యుల ప్రేమతత్వం గురించి ముద్దు ముద్దుగా మాట్లాడిన మాటలు అందరినీ మంత్రముగ్దులను చేశాయి. చిన్నారి వర్షిణి పాడిన పాట అద్భుతంగా ఉందని అందరూ ప్రశంసించారు. తాత్విక బాలవికాస్ చిన్నారి భక్తుడు ఎలా ఉండాలి అని చెప్పిన విషయం



పెద్దలను ఆలోచింపచేసింది. చిన్నారి మోక్ష చేసిన నృత్యం ఆహుతులను ఆకట్టుకుంది. తాత్విక బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన దృశ్యరూప నాటకం చూపరులను ఆకర్షించింది. పీఠం ఆస్థాన అవధాని యర్రంశెట్టి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ జ్ఞాన తత్వం ద్వారా స్వామి ఆశీస్సులు పొందవచ్చని తెలిపారు. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారి 60వ జన్మదినోత్సవం సందర్భంగా స్వామి వారి గురించి ప్రసంగించారు. పీఠం సభ్యులు ఏర్పాటు చేసిన భారీ కేక్ కట్ చేసి తాత్విక బాలవికాస్ చిన్నారులకు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం చిన్నారులకు ఎకో ఫ్రెండ్లీ పెన్నులను అందజేశారు. నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా జన్మదినం సందర్భంగా 60 సంవత్సరాల ఆయన జీవిత పయనంపై నిర్మించిన లఘుచిత్రాన్ని సభలో ప్రదర్శించారు. అనంతరం స్వామి వారికి భక్తులు పుష్ప గుచ్చాలను, పూల మొక్కలను, బహుమతులను అందజేశారు. భక్తులు ఉమర్ ఆలీషా స్వామి వారికి అందజేసిన సన్మాన పత్రాన్ని అవధాని యర్రంశెట్టి ఉమా మహేశ్వరరావు చదివి వినిపించారు. అనంతరం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారు మాట్లాడుతూ భక్తులకు స్వామి వారి యొక్క 60 సంవత్సరాల జీవిత కాలంలో జరిగిన పలు సంఘటనలు, విశేషాలు, అగాథాలను పంచుకున్నారు. స్వామి చేతుల మీదుగా హారతి ఇచ్చారు. భక్తులందరూ స్వామి వారి ఆశీస్సులు పొడి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం, నాగులపల్లి, ఉప్పరగూడెం, ఇసుకపల్లి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరికీ సభ్యులు భోజన కార్యక్రమం నిర్వహించారు

